క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రిని కలిసిన సీఐ



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను కలిసిన సీఐ వాసునాయుడు

సాలూరు: పట్టణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన వాసునాయుడు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గురువారం ఆయన ఉపముఖ్యమంత్రిని పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి పార్వతీపురం డీసీఆర్‌బీ నుంచి బదిలీపై సాలూరు పట్టణానికి వచ్చినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, నిబద్ధతతో పనిచేయాలని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సీఐకి సూచించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన జి.దేముడుబాబు పార్వతీపురం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం వేగవంతం చేయాలి

- ఐటీడీఏ పీఓవిష్ణుచరణ్



పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో పర్యటించి ఆర్‌అండ్‌బీ పనుల ప్రగతిపై ఆరా తీశారు. పెండింగ్ పనులు పూర్తిచేసి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పాచిపెంట మండలంలోని పాంచాలి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీచేశారు. పోలింగ్‌కేంద్రంలో మౌలిక వసతులు, సదుపాయాలను పరిశీలించి పది రోజుల్లో అన్ని పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల పరిశీలన



ఇప్పలవలసలో పాఠశాల రికార్డులను పరిశీలించిన భామిని ఎంఈఓ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన, తరగతుల రికార్డులు, మన బడి నాడు నేడు నిధులతో నిర్వహించిన పనులు, విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలను భామిని ఎంఈఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆర్‌జేడీ ఆదేశాల మేరకు సీతానగరం మండలంలోని సూరంపేట, ఇప్పలవలస ప్రాథమిక పాఠశాలల్లో రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. అలాగే పాఠశాలల్లో నాడు నేడు పథకం నిధుల ద్వారా విద్యాబోధనకు కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీతానగరం ఎంఈఓ-2 ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు తెలియజేశారు. ఆలయం చుట్టు పక్కలగ్రామాల భక్తులతో పాటు జిల్లాలోని పలుప్రాంతాలనుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు పూజాసామగ్రితో వివిధ రకాల వాహనాల్లో తరలివచ్చి పూజల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఉపవాసాలతో దూర ప్రాంతాల నుంచి పూజల నిమిత్తం వచ్చిన భక్తులకు అభిషేకాలు, కుంకుమ పూజలనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వార్డు సందర్శనలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం అందించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన బెలగాం ప్రాంతంలో గల20,21 వార్డుల్లో పర్యటించి జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. స్థానికంగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించి మున్సిపల్ అధికారులను ఆదేశిస్తూ ఎక్కడి సమస్య అక్కడే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. స్థానికంగా ఉన్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వార్డు ప్రజల బాగోగులను తెలుసుకున్న అనంతరం మీ అందరికీ చేదోడువాదోడుగా ఉంటూ ఎంతగానో మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో ఆయనను గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ రణభేరి చిన్ననాయుడు, స్థానిక సచివాలయాల కన్వీనర్లు చందాన ఆనంద్, సామల లలిత, సర్విశెట్టి శ్రీనివాసరావు, ఎస్.సందీప్ కుమార్, జక్కు చిన్నం నాయుడు, సువ్వాడ శ్రీనివాసరావు, సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

గ్రామాల్లో ప్రజాపాలన అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీయేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రూ. 43.60లక్షల నిధులతో నిర్మించిన పార్వతీపురం మండలంలోని పుట్టూరు గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సచివాలయంతో సమానంగా గ్రామస్థాయి సచివాలయం ఏర్పాటుతో ఇంటింటికీ ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. ఒక్క పుట్టూరు గ్రామంలోనే 56 నెలల్లో రూ. 19కోట్లు ప్రజలకు సచివాలయం ద్వారా అందించామని చెప్పారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుంట్రెడ్డి సతీష్‌కుమార్, ఎంపీటీసీ ఏగిరెడ్డి లక్ష్మి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జిశేఖర్, వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్, ఆత్మచైర్మన్ వై. తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, సర్పంచ్‌లు మడక విశ్వనాథం, జక్కు ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి



మున్సిపల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

- వాడీవేడిగా సాగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాలూరు: మున్సిపాలిటీ అధికారుల తీరుపై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సాలూరు మున్సిపల్‌ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్‌కార్యాలయం ఆధ్వర్యంలో పనిచేస్తున్న వాహనాలను భద్రపరిచేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద రూ.11లక్షల 50వేలతో నూతన రేకుల షెడ్ నిర్మాణానికి సమావేశంలో అధికారులు ప్రతిపాదించగా కౌన్సిలర్‌లు గిరిరఘు, రాపాక మాధవరావు, లింగాల దుర్గ, సింగారపు ఈశ్వరరావు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం రూ.2 లక్షలతో నిర్మాణం జరపవచ్చని అటువంటి పనికి రూ.11లక్షల 50 వేలు ఎందుకని ప్రశ్నించారు. వార్డుల్లో విద్యుత్‌పనులు, కుళాయిలు తదితర చిన్నచిన్న మరమ్మతులకు నిధులు లేవని చెప్పే సదరు అధికారులు ఈ విధంగా వృథా ఖర్చులకు నిధులు కేటాయించాల్సిన అవసరమేముందని ఏఈ సూరినాయుడిని నిలదీశారు.

మళ్లీ రోడ్డు వేయాలా?

6వ వార్డులో కొన్ని నెలల క్రితం రోడ్డు నిర్మాణం చేయగా కుళాయి లైన్ల కోసం ఆ రోడ్డును తవ్వేశారని, నేడు మళ్లీ రోడ్డు వేయాలంటూ ప్రతిపాదనలు చేస్తుండడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ముందు చూపుతో వ్యవహరించి ముందు కుళాయి లైన్లు వేసి తరువాత రోడ్డు వేసి ఉంటే నిధులు వృథా అయ్యేవి కాదు కదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కొటేషన్ 5 సంవత్సరాల కాలపరిమితికి ఆమోదంపై సభలో ప్రస్తావించగా సదరు ఏజెన్సీ కాలపరిమితి 2 ఏళ్లకే పరిమితం చేయాలని, తరువాత వారి పనితీరు ఆధారంగా నిర్ణయం తీసుకుందామని సభ్యులు స్పష్టం చేశారు. వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎ.డి సీహెచ్ దీనకుమార్

సీతానగరం: ఎండల తీవ్రత పెరుగుతున్న కారణంగా రైతులు, గొర్రెల కాపరులు పశువులకు నీడ, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించి జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్థక శాఖ సబ్‌డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున నీటితొట్టెల్లో చల్లని నీరు నిరంతరం ఉండేలా చూడాలని సూచించారు. పశువులను కాపరులు, రైతులు ఉదయం 6గంటల నుంచి 10 గంటలలోగా, సాయంత్రం 4 గంటల తరువాత మేతకు తోలాలని సూచించారు. పశువులున్న శాలల్లో గాలి, వెలుతురు ఎక్కువగా ఉండేలా చూడాలని చెప్పారు. పశువులకు ఎక్కువగా పచ్చగడ్డి మేత పెట్టాలని, నీరు దగ్గరలోనే ఉండేలా చూడాలని సూచించారు. శాలల్లో దూడలకు తేలికగా జీర్ణం అయ్యేవిధంగా ఆహారాన్ని అందించాలని తెలిపారు. పశువులు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని వివరించారు.

రూ.5కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాలూరు రూరల్: మండలంలోని దేవుబుచ్చింపేట వద్దగల ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 31.5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పార్వతీపురం ఎస్ఈ లక్ష్మణరావు గురువారం ప్రారంభించారు. ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సాలూరు, పాచిపెంట మక్కువ మండలాల ప్రజలకు విద్యుత్‌కోత సమస్యలు తప్పనున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 10.16 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేదని దాని స్థానంలో రూ.5కోట్లతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో రైతులు, వినియోగదారుల ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఈ కిశోర్, ఎ.డి రంగారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మెరుగైన విద్యనందించాలి

గరుగుబిల్లి: భవిత కేంద్రాల్లోని దివ్యాంగులకు మెరుగైన విద్యనందించాలని రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త ఎస్.అమ్మినాయుడు సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు, ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. అనంతరం కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు సక్రమంగాగా ఫిజియోథెరపీ సేవలు అందించడంతో పాటు నాణ్యమైన విద్యనందించాలన్నారు. అలాగే దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి.భానుమూర్తి, ఎంఈవో-2 కె.కొండలరావు, ఐఈఆర్‌టీ వీర్రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంత రం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయా జీ సహకారంతో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. కార్యక్రమంలో వీరఘట్టం, పార్వతీపురం, మక్కువ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఈ హోమంలో పాల్గొంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహాయ సహకారాలతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

వసతిగృహం పరిశీలన



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: మండలంలోని రావికోన, గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల సిక్ రిజిస్టర్ ను ఈ సందర్భంగా తనిఖీ చేసి ఈ మధ్య కాలంలో జ్వర లక్షణాలతో నమోదైన వివరాలు, నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. ఇతర ఆరోగ్య సమస్యలతో నమోదైన వివరాలు, ఎక్కడ చికిత్స ఇస్తున్నారు, అందుకు సంబంధించిన ఓపీ స్లిప్స్ పరిశీలించారు. సిక్ రూంలో విద్యార్థులతో డాక్టర్ జగన్ మోహన్‌రావు మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేశారు. జ్వర లక్షణాలున్న విద్యార్థికి వైద్య సిబ్బందితో నిర్ధారణ పరీక్ష చేయించారు. ప్రతిరోజూ ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని, వైద్యసిబ్బంది ఇచ్చిన మందులను దగ్గరుండి వేయించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యసిబ్బందికి వెంటనే తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, హెచ్ఎం కె.సిమ్మన్నదొర, వార్డెన్ నరసింహులు, హెల్త్ అసిస్టెంట్ బంగారునాయుడులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల రిలే దీక్ష



కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలుచేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు గురువారం రిలే నిరాహార దీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, ఆర్.రాము, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 279 ప్రకారం జీతాలివ్వాలి

పార్వతీపురం మున్సిపాల్టీ ప్రజారోగ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న డ్రైవర్లకు జీఓ 279 ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ కోశాధికారి జి.వెంకటరమణ మున్సిపల్ డ్రైవర్లు పి.గాంధీ, సంతోష్‌కుమార్ తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టు, ఉమ్మడి జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ సామల సింహాచలం అభినందించారు. ఈ మేరకు గురువారం జెడ్పీ సంస్కృత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. విద్యార్థులు జిల్లాస్థాయిలో బహుమతులు సాధించడం గొప్ప విషయమని ప్రశంసించారు. విద్యార్థులకు గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తూ, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు ఉత్తరావల్లి గోవిందనాయుడిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జేబీ తిరుమలా చార్యులు, కోటేశ్వరరావు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మక్కువ: విద్యార్థి దశనుంచి సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ మంజుల వీణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మక్కువ మండలంలోని ములక్కాయ వలస గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ మంజులా వీణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సేవతో ఆత్మసంతృప్తి కలుగుతుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీఓ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసు బాబు, గణేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్స్‌పోలియో చుక్కలను నిర్ధారించిన ప్రకారం వేయాలని సూచించారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా చిన్నారులకు చుక్కలు వేయాలని, ప్రభుత్వం నిర్ధారించిన ప్రకారం అందరికీ ఆదివారం కేంద్రాల వద్ద, తరువాత రెండు రోజులు ఇంటింటికి తిరిగి మిగిలిపోయిన వారికి చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి, మాధురి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమి పూజ



శివాలయానికి భూమిపూజ చేస్తున్న రామ్మోహనరావు శర్మ

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురం గ్రామంలో శివాలయం నిర్మాణానికి అభయాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు టి. రామ్మోహనరావుశర్మ, నిర్వాహకులతో గురువారం భూమి పూజ చేయించారు. భక్తిభావంతో నిధులు సమకూర్చుకున్న వారు ఇప్పటికే గ్రామ శివారులో అభయింజనేయస్వామి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. అదే ఆలయానికి సమీపంలో దాతలు సమకూర్చిన స్థలంలో రూ.80 లక్షలతో శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు అర్చకుడు రామ్మోహన రావు శర్మ ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్.అప్పలనాయుడు, గంటె రామం, విరామ తెలుగు గ్రేడ్-1 పండిట్ జి.అప్పలస్వామి, ఇ.వెంకటరమణ, పి పారినాయుడు, పి బలరాంనాయుడు, పి నాగభూషణ రావు, భక్తులు పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే జోగారావు సాయంత్రం వచ్చి పరిశీలించారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన సూర్యారావును సన్మానిస్తున్న డీపీఆర్ఓ రమేష్ తదితరులు

పార్వతీపురం: విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని పార్వతీపురం మన్యం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ అన్నారు. ఈ మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి గురువారం ఉద్యోగ విరమణ చేసిన ఇ.సూర్యారావును దుశ్శాలువాతో ఆయన ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వీసులో చేరిన ప్రతి ఒక్క ఉద్యోగికి బదిలీ, పదవీ విరమణ సాధారణమన్నారు. విధి నిర్వహణలో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని స్పష్టం చేశారు. క్రమశిక్షణతో విధుల్లో చూపిన ఆయన నిబద్ధత, అంకిత భావం అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అధికారుల పట్ల వినయ విధేయతలతో మెలిగేవారని ప్రశంసించారు. శేషజీవితం ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బంది ఆయనకు జ్ఞాపికను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ పి.గణేష్‌బాబు, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ ఎం.గణపతి రావు, సహాయ ఇంజినీర్ సీహెచ్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెకు కానుక



పెళ్లి కుమార్తె శైలజకు నగదు, చీరను అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామానికి చెందిన పేదింటి పెళ్లి కుమార్తెకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పెళ్లికానుక అందించారు. శైలజకు పెళ్లి కానుకగా పదివేల రూపాయలు, చీర జాకెట్, పసుపు కుంకుమ, గాజులను సర్పంచ్ మరడ.వెంకటరత్నం చేతుల మీదుగా అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు, పెళ్లి కుమార్తె తండ్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

సాలూరు / సాలూరు రూరల్:

ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.16కోట్ల49 లక్షలతో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, చేపట్టబోయే పనులకు శంకుస్థాపనలను ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర చేయనున్నారని ఐటీడీఏ డీఈ మణిరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ, మూడు రోజుల పాటు ఉపముఖ్యమంత్రి ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

మార్చి1 వ తేదీన సాలూరు మండలంలో కొత్తవలస, తోణాం, అన్నంరాజువలస, నేరెళ్లవలసల్లో అభివృద్ధి పనులు, 2వ తేదీన పాచిపెంట మండలంలోని రాయిగుడ్డివలస, కర్రివలస, పి.కోనవలసలలో, 3వ తేదీన సాలూరు మండలంలో తోణాం, కురుకూటి, మావుడి, తుండ గ్రామాల్లో, 4 వ తేదీన మక్కువ మండలంలో మార్కొండ పుట్టి, దబ్బగెడ్డలలో మొత్తం రూ.16కోట్ల49 లక్షలతో చేసిన, చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేస్తారని వివరించారు.